## 136 వేరొక నామమున రక్షణ లేదు

రా - యమునా కల్యాణి తా - త్రిపుట

యేసు నామామృతము కన్నను - వేరే మాకిఁక లేదుగా = దోసముల నెడబాపి పరమని - వాస పదవికిఁ జేర్పుఁగా ॥యేసు॥

1. నిత్య రక్షణ నిత్య జీవము - నిజముగా మాకిచ్చును = సత్యసువిశేషార్థసారము - సతము గ్రోలుట కొసఁగెను ॥యేసు॥

2. దురిత భవ మను నంధకారము - దూరముగఁ బోఁదోలెఁగా = అరయఁ దన విమలాత్మ వరమున - మరల మము వెలిఁగించెఁగా ॥యేసు॥

3. గొప్ప కుల గర్వముల మెప్పను - తప్పుల న్విడఁగొట్టెను = చెప్ప శక్యముగాని రక్షణ - సృష్టిలో మము నిల్పెను ॥యేసు॥

4. అడ్డు పరచు పిశాచి మార్గపు జిడ్డులను ఛేదించెను = దొడ్డ కాపరి యేసు తన దగు - దొడ్డిలో మముఁ జేర్చెను. ॥యేసు॥

- గొల్లపల్లి నతానియేలు

## 137 యేసు నామము మధురము

రా - మారవ తా - ఆది

యేసు నామ - మెంతో మధురం - యేసు నామ - మెంతో మధురం = దోసములు మోసములు - నాథ మొనరించు ప్రభు ॥యేసు॥

1. స్వాంతమునను - శాంతి నిడును = చింతలను భ్రాంతులను - వింతలుగఁ ద్రుంచు ప్రభు ॥యేసు॥

2. నెమ్మి జేయు కమ్మివేయు = నమ్మికలు సొమ్ములుగ - ముమ్మరము జేయు ప్రభు ॥యేసు॥

3. ప్రేమ లెదుగు - క్షేమ మొదవు = కామ గుణ పామరతి - లేమి చొరనీదు ప్రభు ॥యేసు॥

4. మోక్ష దశకు - సాక్ష్య మొసఁగు = నక్షయ సురక్షణకు - దక్షత వహించు ప్రభు ॥యేసు॥



5. శీల మతుల - పాలి వెతలఁ = తూలఁ జనఁదోలి తన - జాలి కనపరచు ప్రభు ॥యేసు॥

- పురుషోత్తము చౌధరి

## 138 యేసు నామము పావనము

రా - ఆనందభైరవి తా - అట

యేసు నామమే పావనము - మాకు - యేసు గద నిత్య జీవనము = దాస జన [1]హృద్వికాసమైయెల్ల - దోసములకు వి - నాశకరమైన ॥యేసు॥

1. సాధు మానసోల్లాసములు యేసు - నాధు గుణ చిద్విలాసములు = బోధఁ గొను వారి - బాధ వెడలించి - మాధుర్యమగు ముక్తి - సాధనములిచ్చు. ॥యేసు॥

2. [2]భక్త జన లోక పూజ్యములు [3]రక్త - సిక్త పాదపయోజములు = [4]ముక్త రాజ్యాభి - షిక్తుఁడౌ సర్వ - శక్తి యుతుఁడైన - సామియగు క్రీస్తు ॥యేసు॥

3. దీన జన నిత్య [5]తోషణము - సిల్వ - మ్రాని ప్రభు మృత్యు ఘోషణము = [6]పానకము జుంటి - తేనియల [7]స్వాదు - వీనులను [8]గ్రోలు - మానవుల కెల్ల ॥యేసు॥

4. పాపులకు మంచి [9]పక్షములు - ముక్తిఁ జూపు క్రీస్తు కటాక్షములు = పాప [10]సందోహ - కూపమునఁ గూలు - కాపురుష నన్నుఁగాచుకొనిప్రోచు ॥యేసు॥

- పురుషోత్తమ చౌధరి

## 139 యేసు నామస్మరణ

రా - అసావేరి (చాయ: భజో మధుర) తా - ఆది

యేసే, భగవన్నామం భజింపను - యేసే, భగవన్నామం = భజింప నిరంతర ॥యేసే॥

---

[1]మనస్సును వికసింపజేయునది. [2]భక్తజనుల సమూహముచేత పూజింపబడదగినది. [3]రక్తముచేత తడపబడిన పాదపద్మములు. [4]ముక్తి రాజమునకు రాజుగా నభిషేకింపబడినవాఁడు. [5]సంతోషము. [6]పానకముయొక్క పూదీనెయొక్క. [7]మధురము [8]త్రాగు. [9]సహాయములు. [10]సమూహమనెడు నూతిలో.